కథా నిలయం
3772
శ్రీకాకుళం

# యువర్ అటెన్షన్ ప్లీజ్

"యువర్ అటెన్షన్ ప్లీజ్... అందరూ వినండి" భద్రాద్రి చేతులు పైకెత్తి అరచిన అరుపులకు అందరం నిశ్శబ్దంగా అయ్యాము.

"రేయ్... మూడు రోజుల క్రితం ఢిల్లీలో పట్టపగ్రలా బ్యాంకు పగలగొట్టి ముప్పై లక్షలు దోచుకుపోయారు. దారిలో మూడు కారులు మార్చారు. ఇప్పటికీ ఐడెంటిఫికేషన్ దొరకలేద్రా..."

"ఎట్లా జరిగింది భద్రాద్రీ" అడిగాడు మామూ.

"ఏముందిరా! ముందు వాచ్‌మెన్‌ని కాల్చేశార్రా... తరువాత లోపలికెళ్ళి కాషియర్‌కు కత్తి చూపించి మొత్తం దోచుకున్నారు. మరో విషయంరో...! పట్టిచ్చిన వాళ్ళకు పాతికవేల రూపాయల బహుమతి ఇస్తారట్రో..." అతని కళ్ళు ఆశ్చర్యంతో మెరుస్తున్నాయి.

"నెక్ట్స్..." అన్నాడు భాషా.

"పారిస్‌లో ఒకచోట రోయ్... తొంభై ఏళ్ళ ముసలోడు పధ్నాలుగేళ్ళ మనవరాల్ని రేప్ చేశాడురా... వాడికెలాంటి శిక్షవేస్తారో. రోజులు చూడ్రా ఎలా వున్నాయో!" అతని గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.

"ఇది వినండి... చీరాల్లో కోతి భలే అల్లరి చేస్తూందట్రా! పట్టిచ్చిన వాడికి వెయ్యి రూపాయలు బహుమతి..." కోతిలాగ ఎగిరాడు భద్రాద్రి.

"భద్రాద్రీ! టైము ఐదు నిమిషాలే ఉంది. వార్తలు త్వరగా చెప్పెయ్. ఆఫీసరు వచ్చే టైమయింది..."

భద్రాద్రి మళ్ళీ అందుకున్నాడు... "ఏముందిరా! రాజకీయాలు నిలకడ లేకపోయాయి. చీఫ్ మినిస్టరు రేపు మినిస్టర్ల పోర్టుఫోలియోలు మారుస్తాడట ఎవరు ఏ పోర్టుఫోలియో అయింది రేపు చెబుతాన్రా? న్యూస్ ఓవర్... ఎవ్రా టీ ఇప్పించేది?"

నేను లేచాను. నా వెంట భద్రాద్రి బయలుదేరాడు.

భద్రాద్రి వయస్సు యాభై మూడేళ్ళు. అతని వయసును బట్టి అతను ఎవర్ని "ఒరే" అన్నా ఖాతరం పట్టించుకోం. గుమస్తాగా ఉద్యోగంలో చేరాడు. గుమాస్తాగానే రిటైరవ్వబోతున్నాడు.

వస్తువుల ధరలు బుసకొట్టే త్రాచుపాముల్లా వున్న ఈ రోజుల్లో గుమాస్తాకు ఓ న్యూస్ పేపరు ఇంటికి తెప్పించుకోవాలంటే అలివయ్యే పని కాదు. ఆఫీసుకో ఇంగ్లీషు డెయిలీ వస్తుంది. అది ఆఫీసరుగారి టేబుల్ మీదికి పోతుంది గనుక ఎవరం చొరవ తీసుకోము. ఆ పరిస్థితులలో మా ఆఫీసుకు పర్మనెంటు ఆర్టిస్టయిన భద్రాద్రి ఉదయాన్నే నిద్ర లేచి సెంటరుకు వెళ్ళి అన్ని ఇంగ్లీషు, తెలుగు పత్రికలు అరువు చదివి (ఉచితంగా) వస్తుంటాడు.

ఆఫీసు పదిన్నరకనగా ఓ అరగంట ముందుగా వచ్చి వార్తలు చదువుతాడు. ఆ సమయానికి మేమంతా చేరుకొని ఉంటాము. మొదట్లో మర్యాదకు మేము కాఫీకి పిలిచేవాళ్ళం. కాని ఇప్పుడు అతనే అడుగుతున్నాడు.

• • • •

అన్ని రోజుల్లాగే ఆ రోజునూ సూర్యుడు నడ్డిమీద మోస్తున్నాడు. ఉదయం. పదింబావయింది. చిన్నగా వర్షపు తుంపరలు పడుతున్నాయి. భద్రాద్రి ఇంకా రానందుకు విసుగ్గా వుంది. ఇంతలో "యువర్ అటెన్షన్

ప్లీజ్... అందరూ వినండి" తన మామూలు ఫక్కీలో చెప్పడం మొదలు పెట్టాడు.

"ఈరోజు వార్తలు చెప్పుకోదగ్గవేంలేవు.. విజయవాడలో రెండు వందల గుడిసెలు తగలబడిపోయాయి. ఎవడో వెధవ సిగరెట్ త్రాగి వేశాడట...రేయ్ ఇది వినండిరా ఎంత తమాషాగా వుందో, ఒక తాత, మనవడి మూడో పుట్టినరోజున ఎక్కడో అప్పుచేసి మూడువేలు తెచ్చి ఓ బంగారు చైను, వాచి, ఉంగరం చేయించాడురా...ఆ రాత్రి తన ప్రక్కనే పడుకోబెట్టుకున్నాడు మనవడ్ని. అంతే. తెల్లవారేసరికి మన వాడు ప్రక్కన లేడు...తెల్లవారి వెతికినా ప్రయోజనం లేకపోయింది.

"అయ్యయ్యో" అన్నాం అందరం విచారంగా.

"అయితే ఒక విచిత్రం జరిగింది. పోలీసు రిపోర్టు ఇవ్వాలని వాళ్ళు అనుకొంటూండగా పిల్లవాడు ఏడుస్తూ వీధిలోంచి వచ్చాడు..."

"నగలున్నాయా..." ఆత్రంగా అడిగాడు వేమరాజు.

"ఇంకెక్కడుంటాయిరా నగలు... ఆ ముసలోడికి ఒక వైపు బిడ్డ తిరిగి వచ్చినందుకు సంతోషంగా వున్నా...మూడువేలు ఏట్లో పోయాల్సొచ్చినందుకు తలచుకొని తలచుకొని ఏడ్చాడు"...భద్రాద్రి గుండెల్లోంచి ఏడుపు తన్నుకొచ్చింది. అదే మాకు నచ్చని విషయం. ఎవరికేం జరిగినా తనకే జరిగినట్లు అందులో లీనమయిపోయి తనూ బాధపడతాడు.

"భద్రాద్రీ...మరేం బాధపడకు...కాఫీకి వెల్దాంరా!" పిలిచాడు బాషా.

"బాధపడక ఏం చేసేదిరా...ఆ ముసలాడ్ని నేనే. నా మనవడి నగలే దొంగలెత్తుకుపోయారు" ముఖం అరచేతుల్లో పెట్టుకుని దుఃఖిస్తూ

న్నాడు. మా అందరి గుండెలు భారమయ్యాయి. ఈ షాకు నుంచి ఎలా తేరుకుంటాడో అనుకొన్నాము.

* * * *

కాని మేం ఊహించని విధంగా మరురోజు పదిగంటలకు "యువర్ అటెన్షన్ ప్లీజ్...అందరూ వినండి ఈ రోజు వార్తలు..." గుండెలోని బాధను అదిమిపెట్టి, చేతులు పైకెత్తి చెప్పడం మొదలుపెట్టాడు భద్రాద్రి.

*